సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పార్కింగ్ ప్రదేశంలో నిర్మాణాలు వద్దు

విశాఖ న్యాయవాదుల విజ్ఞప్తి

విశాఖ లీగల్: విశాఖ న్యాయస్థానాల సముదాయంలో పార్కింగ్ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని పలువురు న్యాయవాదులు కోరారు. సోమవారం పలువురు విశాఖ న్యాయవాదులు హైకోర్టులో పలువురు న్యాయమూర్తులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఇటీవల నూతనంగా నిర్మించిన న్యాయస్థానం సముదాయంలో జిల్లా కోర్టు, రోడ్లు భవనాల శాఖ సంయుక్తగా డిజిటల్ రూమ్‌ల నిర్మాణాలు చేపడుతోంది. దీనిని న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని, అలాగే డిజిటల్ రూమ్‌లకు తాము వ్యతిరేకం కాదని పలువురు న్యాయవాదులు కోరారు. ఈ విషయాన్ని హైకోర్టు న్యాయమూర్తుల దృష్టికి తెచ్చామని పలువురు న్యాయవాదులు తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన నూతన సీఈవో



చైర్‌పర్సన్ సుభద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా బాధ్యతలు స్వీకరించిన పి.నారాయణమూర్తి సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.


ఎస్సీ నివాస ప్రాంతాల్లో సదుపాయాలపై సర్వే



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: 100 రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో వెనుకబాటుకు గల కారణాలపై ఈ నెల 15లోగా క్షేత్రస్థాయిలో సర్వే చేయించి, నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లాలోని అన్ని ఎస్సీ నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై సర్వే చేసి, వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సుభోజనం కౌంటర్ ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట: కేజీహెచ్‌లో హరేకృష్ణ మూవ్‌మెంట్ టచ్ స్టోన్ చారిటీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుభోజనం సౌకర్యం కౌంటర్‌ను సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కేజీహెచ్‌లో నూతన భవనాలతోపాటు మరిన్ని సేవలందించేందుకు తాను కృషి చేస్తానని చెప్పారు. వెంకటపతిరాజు రూ.10 వేల చెక్కును వంశీకృష్ణ చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి దాస్, పెద్దలు, కార్పొరేటర్ అప్పలరత్నం, కూటమి నాయకులు శివప్రసాద్‌రెడ్డి, యజ్ఞశ్రీ, సి.ఎం.రమణ, గాయత్రి, జోగి రాజు, కేజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

- 29, 30 వార్డుల్లో స్వైర విహారం
- స్థానికులు, పాదచారుల భయాందోళనలు
- గాయాలపాలవుతున్న వాహన చోదకులు
- **ఫిర్యాదులపై స్పందించని అధికారులు**

కుక్కలు భౌబోయ్..!



దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29, 30 వార్డుల్లోని పలు కాలనీల్లో వీధి కుక్కల బెడద అధికమైంది. గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ స్థానికులు, పాదచారులు, వాహన చోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆయా వీధులు, రోడ్లపై నంచరిస్తూ దారిన పోయే వారి వెంటపడుతున్నాయి. గత వారం రోజుల్లో ఆయా ప్రాంతాల్లో పలువురు స్థానికులు, పాదచారులపై కుక్కలు దాడికి దిగి గాయపరిచాయి. 29వ వార్డులోని పలు వీధుల్లో కుక్కల బెడద మరింత తీవ్రంగా ఉంది. పగలూ.. రాత్రి పాదచారులు, వాహన చోదకుల వెంటపడుతున్నాయి. కుక్కల బారిన పడి పలువురు గాయాలపాలయ్యారు. వాటి అరుపులకు రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదని దిబ్బలపాలెం, చందక వీధి వాసులు వాపోతున్నారు. అర్ధరాత్రి దాటాక విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే వారిని కుక్కలు వెంటపడి తరుముతున్నాయి.

గుంపులు గుంపులుగా దాడులు

ఈ వార్డుల పరిధిలో ఇటీవల కాలంలో అనేక కుక్కలు సంచరిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో కొద్ది రోజుల కిందట పిల్లలు, పెద్దలను పరుగులు పెట్టించి మరీ వారిపై దాడి చేశాయి. **ఇటీవల దిబ్బలపాలెం**లో పలువురు పాదచారులపై, **చందక వీధి**లో మరి కొంతమందిని, **పలువురి వాహన** చోదకులపై కుక్కలు దాడి **చేశాయి. ఆయా వీ**ధుల్లో ఎక్కడో ఒక చోట **ఎవరో ఒకరు కుక్క**కాటుకు గురవుతున్నారు. **గుంపులు గుంపులు**గా అవి సంచరిస్తుండటంతో **రోడ్డు మీదకు వచ్చే**ందుకు జనం జంకుతు**న్నారు. ఈ వార్డుల్లో** పాఠశాలలు ఎక్కువగా ఉం**డటంతో పిల్లలు స్కూ**ళ్లకు వెళ్లేటప్పుడు కుక్క**లను చూసి భయపడు**తున్నారు. ఈ సమస్యపై **ఫిర్యాదు చేసినా ఎవరూ** పట్టించుకోవడం లేదని **పలువురు స్థానికులు** వాపోతున్నారు. సంబం**ధిత అధికారులు స్ప**ందించి తగు చర్యలు తీసు**కోవాలని కోరుతున్నా**రు.



రహదారిపై విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

కుక్కల నియంత్రణకు చర్యలేవి?



కుక్కల నియంత్రణకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. వీధి కుక్కలను తీసుకెళ్లి ఇంజక్షన్లు వేసి మళ్లీ వదిలేయడంతో అవి తిరిగి వచ్చేస్తున్నాయి. కుక్కలను తరలించే వాహనం కనబడలేదు. ఈ సమస్యపై సచివాలయంలో ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. సమస్యను పరిశీలించి అధికారులు చర్యలు చేపట్టాలి.

–నాగమణి, దిబ్బలపాలెం

రాత్రిళ్లు వెంటపడుతున్నాయి



రాత్రి పూట విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో కుక్కలు గుంపులు గుంపులుగా ద్విచక్ర వాహనాల వెంటపడతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు దృష్టి సారించి వీధికుక్కలను నియంత్రించాలి.

–బండారు లోకేష్‌కుమార్, స్థానికుడు

నిరాశ్రయులకు వసతి గృహంలో ఆశ్రయం



ఏఎస్‌ఐ సమక్షంలో ఇద్దరు నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న కార్యదర్శి వాసు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఇద్దరు నిరాశ్రయులకు జీవీఎంసీ–ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. వన్‌టౌన్ సూర్యాబాగ్‌లోని పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్ మీద కైలాసపురానికి చెందిన లోక్కోజి మురళీ, విజయనగరం జిల్లాకు చెందిన సరస్వతుల మురళీ కొంతకాలంగా నివసిస్తున్నారు. కార్యాలయానికి రాకపోకలు సాగించే సమయంలో వీరిని గమనించిన సీపీ.. ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ ఏఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో రెస్క్యూ నిర్వహించి వీరిని ద్వారకానగర్‌లోని గల జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. ఏయూటీడీ సంస్థ కార్యదర్శి వాసు, వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు వీరికి ఆశ్రయం కల్పించారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: సూర్యాబాగ్‌లోని జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదిక కార్యక్రమానికి పలు వినతులు అందాయి. ప్రజల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు ఒకటి, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. జోన్ పరిధిలోని ప్రజలు టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, తాగునీరు, ఆక్రమణలు, అక్రమ కట్టడాలు, డెబ్రిస్, కుక్కల బెడద, వీధిలైట్లకు సంబంధించిన ఫిర్యాదులను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జోన్ సహాయ వైద్యాధికారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్, పబ్లిక్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రెవెన్యూ విభాగం అసిస్టెంట్ కమిషనర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ సంత తరలించొద్దని ధర్నా



నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, మధురవాడ వారపు సంత వర్తకులు

సీతమ్మధార: మధురవాడలో తరతరాలుగా నిర్వహిస్తున్న సంతను తరలించి పేదలైన తమకు అన్యాయం చేయవద్దని చిల్లర వర్తకులు కోరారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. మధురవాడలో వారాంతపు సంతను తరలించి మా పొట్టలు కొట్టొద్దని పెద్ద ఎత్తున వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెండు వారాలుగా సంత వర్తకులను ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు అడ్డుకుని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ సమస్యపై సంఘ పెద్దలు, యూనియన్‌ల నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యాపారుల ఉపాధికి నష్టం జరగకుండా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని యూనియన్ నాయకులు తెలిపారు. సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు, డి.కొండమ్మ, జి.కిరణ్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.లక్ష్మి, వెంకటేశ్వరరావు, అరుణ, సంత సంఘం నాయకులు టి.అప్పారావు, కె.లలిత, వి.వెంకటరావు, ఎస్.కె.ఫాతిమా, పి.పైడికొండ, లక్ష్మి, సంత వ్యాపారులు పాల్గొన్నారు.

సంత వ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలి

మహారాణిపేట: మధురవాడ సంత విక్రయదారుల ఉపాధికి రక్షణ కల్పించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ హరేందర ప్రసాద్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. మధురవాడ జోనల్ ఆఫీస్ వద్ద 40 ఏళ్లగా శనివారం నాడు సంత నిర్వహిస్తూ 250 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. వీరి ఉపాధికి రక్షణ కల్పించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని మధురవాడ జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు.

'వయోశ్రీ యోజన' లబ్ధిదారులకు ఉపకరణాల పంపిణీ

బీచ్‌రోడ్డు: వయోశ్రీ యోజన పథకంలో భాగంగా 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో సోమవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి రాజ్యసభ మాజీ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 817 మంది వయోశ్రీలకు రూ.44 లక్షల విలువైన 3,083 ఉపకరణాలు అందజేశామన్నారు. ప్రధాని మోదీ దివ్యాంగులు, వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, వీరికి ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, నెక్ కాలర్, నీ బెల్ట్, నడుము బెల్టులు, రో లెటర్, క్లచ్చస్, ఎల్బో, వాకింగ్ స్టిక్ మొదలైనవి అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, అలీమ్ కో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఏడీకి పదోన్నతి



ఏడీ శ్రీనివాస్ కుమార్

మహారాణిపేట: కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్(పరిపాలన) సీహెచ్.శ్రీనివాస్ కుమార్‌కు పదోన్నతి లభించింది. శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డిప్యూటీ డైరెక్టర్ (పరిపాలన)గా నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 మార్చి 30నుంచి కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్‌గాను, వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



నౌరోజీ రోడ్డులోని జి.శాంతి స్వగృహంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు నౌరోజీ రోడ్డులోని జి.శాంతి అనే మహిళ తన స్వగృహంలో దసరా సందర్భంగా అందిరినీ ఆకట్టుకునేలా.. ఆకర్షణీయంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సనాతన సంప్రదాయాల్లో భాగమైన బొమ్మల కొలువును 15 ఏళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సంస్కృతిని భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తన భర్త విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు, చర్మ వైద్య నిపుణుడు జి.రఘురామారావు సహకారం ఎంతో ఉందన్నారు. బొమ్మల కొలువు సందర్శించడానికి స్థానికంగానే గాక వివిధ ప్రాంతాల నుంచి మహిళలు తరలివస్తున్నారని శాంతి చెప్పారు.

మాతృ మరణాలు సంభవిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతృ మరణాలు జరిగితే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఆయన అధ్యక్షతన మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గత నెలలో రెండు మాతృ మరణాలు సంభవించాయన్నారు. సంబంధిత అధికారులు, వైద్యులు వివరణ ఇవ్వాలని కోరారు. సంబంధిత ఏరియా యూపీహెచ్‌సీ వైద్యులు, ఆశా, ఏఎన్‌ఎంలు దీనికి బాధ్యత వహించాలని చెప్పారు. ఎవరైనా గర్భిణులు అస్వస్థతకు గురైనప్పుడు వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఆమెను వెంటనే డాక్టర్ వద్దకు తీసుకెళ్లి తగిన వైద్యం చేయించాలని సూచించారు. ఇకముందు మాతృ మరణాలు జరగకూడదని డీఎంహెచ్‌వో ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ శంకర్‌ప్రసాద్, ఎస్.జీవన రాణి, బి.ఉమావతి, ఎస్.షర్మిలకుమారి, శ్రీదేవి, శ్రవణ్, జి.వి.గణేష్, ఎస్.సి.బి.నాయుడు, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి ఎస్.జయదేవి, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు, జిల్లా వైద్యులు పాల్గొన్నారు.

అఖిలాండేశ్వరి పాలయమాం



అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి



అల్లిపురంలో కొత్తమ్మవారు



మహాచండీ అలంకరణలో ఉమాదేవి



లలితాదేవిగా సాగరగిరి కనకదుర్గ



కైలాస గౌరీ పూజలో పాల్గొన్న మహిళలు

దాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ సామూహిక కైలాస గౌరీ పూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పాతనగరం సత్యసాయి సేవా సంస్థచే భజన కార్యక్రమం చేపట్టారు. కన్యల పూజలో పలువురు యువతులు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి మంగళవారం చండీదేవిగా దర్శనమిస్తారని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్, ఆలయ కమిటీ సభ్యులుపాల్గొన్నారు.



శివరామకృష్ణ దేవస్థాన పూజల్లో పాల్గొన్న భక్తులు

లలితాత్రిపుర సుందరీదేవిగా దుర్గాలమ్మ

35వ వార్డు పూర్ణా మార్కెట్ వెలంపేటని దుర్గాదేవి ఆలయంలో ఐదో రోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు, భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం మహాసరస్వతి దేవిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నవరాత్రుల పూజా రుసుం రూ.200

నవరాత్రుల పూజ చేయించుకునే భక్తులు, వారి గోత్ర నామాలు తెలిపి దేవస్థానంలో ముందుగా రూ.200 పూజా రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

మహాచండీగా ఉమాదేవి

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో కొలువైన ఉమాదేవి అమ్మవారు మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

స్కంధమాతగా కొత్తమ్మవారు

అల్లిపురం అమ్మవారి వీధిలో వెలసిన కొత్తమ్మవారు స్కంధమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో విశేష హోమాలు, పూజలు చేశారు. హోమ కార్యక్రమంలో స్థానిక నీలాపు కిషోర్‌రెడ్డి దంపతులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

లలితాదేవిగా సాగరదుర్గ

సాగరగిరి కనకదుర్గమ్మ సోమవారం లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పాలస్తీనాకు అండగా ఉందాం



ప్రదర్శనలో వామపక్ష నాయకులు, కార్యకర్తలు

సీతమ్మధార: పాలస్తీనాకు అండగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఇతర వామపక్ష పార్టీల నాయకులు విజ్ఞప్తి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ మారణహోమం సృష్టించి ఏడాదైనా ఇంకా అక్కడ పరిస్థితులు మారలేదన్నారు. ఐక్యరాజ్య సమితి అక్కడ శాంతి నెలగొల్పాలని కోరారు. సోమవారం లలితా జ్యువెలర్స్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకు శాంతి ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, పైడిరాజు మాట్లాడుతూ ఇజ్రాయెల్ దాడుల్లో జరిపి 42వేల మంది మృతి చెందారని, ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ఖండించలేదన్నారు. అమెరికా అండదండలు చూసుకొని ఇజ్రాయెల్ పేట్రేగిపోతోందని అక్కడ తక్షణమే శాంతిని నెలకొల్పాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ సీఎంపీఎస్ శర్మ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ నరసింగరావు, కె లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ ఎంల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఎస్.గోవింద రాజులు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం

బీచ్‌రోడ్డు: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆర్కే బీచ్ వద్ద గుర్తించారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. సుమారు 50 ఏళ్లున్న వ్యక్తి మృతదేహం సోమవారం ఆర్కే బీచ్ వద్ద కాళీమాత దేవాలయం మెట్ల వద్ద స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించగా అతడి వద్ద మందులు ఉన్నాయని, అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో తేలింది. కేజీహెచ్ మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. ఎవరైనా గుర్తిస్తే సంప్రదించాలని పోలీసులు కోరారు.

వాసుపల్లి ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారి సేవలో వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో 104 ఏరియాలోని తన కార్యాలయంలో సోమవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శాంతి రూపాన కనకదుర్గమ్మ అవతారంలో అమ్మవారిని ప్రతిష్టించి ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. వాసుపల్లి కుటుంబ సమేతంగా కనకదుర్గమ్మకు విశేష పూజలు చేశారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎక్కడున్నా పిలిస్తే పలికే దైవం కనకదుర్గమ్మని అన్నారు. తన కార్యాలయ ప్రాంగణంలో శరన్నవరాత్రుల అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా తిరు ఊరేగింపు ఉత్సవం, అణువు కార్యక్రమం ఉంటాయని చెప్పారు.

5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

రోడ్డెక్కిన రెల్లి కులస్తులు



ర్యాలీ చేస్తున్న రెల్లి, రెల్లి ఉపకులాలు

దాబాగార్డెన్స్: రెల్లి, రెల్లి ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని విశాఖ జిల్లా రెల్లి సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ కూడలి నుంచి దాబాగార్డెన్స్, ప్రెస్‌క్లబ్ జంక్షన్, ప్రకాశరావుపేట, జగదాంబ జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఈ ఏడాది ఆగస్టు ఒకటిన కీలక ప్రకటన చేసిందని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఏ,బీ,సీ,డీ కేటగిరీగా వర్గీకరించవచ్చని తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఉన్న రెల్లి, రెల్లి ఉపకులాల దుర్భర జీవన విధానం, వెనుకబాటుతనం పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని, గతంలో రెల్లి కులస్తులకు కల్పించిన ఒక శాతం రిజర్వేషన్ ఉపయోగకరంగా లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభాలో 10 లక్షల మంది రెల్లి కులస్థులు ఉండగా, తక్కువ శాతంగా చూపించి ఒక శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. నవ్యాంధ్రలో రెల్లి, రెల్లి ఉపకులాలు అధిక శాతంలో ఉన్నారని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబాటు తనంపై పరిగణనలోకి తీసుకుని 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఆడమ్స్, ఎస్ కల్యాణముని, వడ్డాది మధుసూధన్, ఇంటి గురుమూర్తి, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, బంగారు ఈశ్వరరావు, చెన్నా పాల్, వడ్డాది ప్రకాష్, సురుపల్లి మోహన్‌కుమార్, మాడుగుల భాస్కర్, దశమంతుల చిన్ని, కొట్నాల రవి పెద్ద ఎత్తున రెల్లి, రెల్లి ఉపకులాల నాయకులు పాల్గొన్నారు.

'భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి'

మహారాణిపేట: శారదా పీఠం భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కోరారు. సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. పీఠం ప్రవేశ ద్వారం ఎదుట ఉన్న పబ్లిక్ రోడ్డును తన అధీనంలోకి తీసుకున్నారని, గెడ్డ స్థలంలో గోశాల ఏర్పాటు చేశారని, వీటిపై చర్యలు తీసుకోవాలని బి.వి.రామ్ వినతిలో పేర్కొన్నారు.